సాక్షి కామారెడ్డి

బుధవారం । 4 । డిసెంబర్ । 2024



మహిళల సంక్షేమానికి కృషి

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



విత్తన క్షేత్రంలో సాగుకు సన్నద్ధం

మాల్తుమ్మెదలోని విత్తన క్షేత్రంలో యాసంగి సీజన్‌లో పంటల సాగుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
32.6/20.6

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

5న సర్టిఫికెట్ల వెరిఫికేషన్

కామారెడ్డి అర్బన్: డీఈఈ సెట్‌లో అర్హత పొంది గతంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకానివారు గురువారం నిజామాబాద్‌లోని డైట్ కళాశాలకు రావాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయినవారు ఈనెల 7 నుంచి 9వ తేదీవరకు వెబ్ ఆప్షన్ ఇవ్వాలని సూచించారు. మొదటి విడతలో జాయిన్ అయినవారికి స్లైడింగ్ అవకాశం ఉందని పేర్కొన్నారు. రెండో విడతలో సీట్లు పొందిన వారు ఈనెల 13 నుంచి 17 వరకు ఆయా కళాశాలలకు వెళ్లి రిపోర్ట్ చేయాలని సూచించారు. రెండో విడతలో మిగిలిపోయిన సీట్లను ఈనెల 18న మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

పోషవ్వకు పురస్కారం



కామారెడ్డి అర్బన్ : గో ఆధారిత ఉత్పత్తులు చేస్తున్న దివ్య హస్తం ట్రస్ట్ యాజమాని, దివ్యాంగురాలు చింతల పోషవ్వకు రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ సెల్ఫ్ ఎంప్లాయి పురస్కారం అందించింది. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో వికలాంగుల సహకార కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్



కామారెడ్డి టౌన్ : ఈనెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా జడ్జి వీఆర్ఆర్ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ భవనంలో న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయాలన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు లాల్‌సింగ్, శ్రీనివాస్‌నాయక్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి, జూనియర్ జడ్జి సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలి'



సదాశివనగర్: ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలని జిల్లా మాతా, శిశు ఆరోగ్య కార్యక్రమం అధికారి అనురాధ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి, బిడ్డల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సిబ్బంది అంకితభావంతో సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఆస్మా అఫ్సిన్, సీహెచ్‌వో నాగరాజు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు వసతి సౌకర్యం



కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలో నిరాశ్రయులైన వారికి వసతి సౌకర్యం కల్పించామని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. మున్సిపాలిటీ పక్కన గల ఆశ్రమంలో సుమారు 20 మందికి మంగళవారం ఆశ్రయం కల్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ నిరాశ్రయులకు దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో భోజన సౌకర్యం కల్పించామన్నారు. వారికి అవసరమైన తాగునీరు అందించామని, బెడ్ షీట్స్ సమకూర్చామని తెలిపారు.

అభివృద్ధే ధ్యేయం



- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన
- విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి
- లెండి, నాగమడుగు పథకాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ''మాది ప్రజా ప్రభుత్వం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్నాం. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం. జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నా. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నా. నామినేటెడ్ పదవుల విషయంలో వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టా. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్న సంకల్పంతో సాగుతున్నారు'' అని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది అవుతున్న సందర్భంగా 'సాక్షి' ఆయనను ఇంటర్వ్యూ చేసింది. నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను చేస్తున్న కృషిని ఆయన వివరించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని పేర్కొన్నారు. ఇంటర్వ్యూ వివరాలు..

ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల..

జుక్కల్ నియోజక వర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేయించా. మద్నూర్‌లో రూ.305 కోట్లతో చేపట్టే ఈ భవన నిర్మాణానికి శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేయనున్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో నియోజకవర్గంలోని విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. భవనాలను త్వరితగతిన పూర్తి చేయించి, తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

వినూత్నంగా ఏఎంసీ చైర్మన్ల ఎంపిక

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జుక్కల్ నియోజకవర్గంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల ఎంపిక కోసం వినూత్న ప్రక్రియ చేపట్టా. పార్టీ నాయకుల ముందే మార్కెట్ కమిటీలు, వాటి ప్రాధాన్యత, రైతులకు ఎలాంటి మేలు చేస్తారన్న విషయాలపై ఆశావహులను ప్రశ్నలడిగా.. మెరుగైన సమాధానాలు ఇచ్చిన వారినే ఎంపిక చేశా. దీనిని సీఎం రేవంత్‌రెడ్డితో సహా ప్రభుత్వ, పార్టీ పెద్దలందరూ మెచ్చుకున్నారు.

సాగునీటి కష్టాలు తీరుస్తా

అంతర్రాష్ట్ర ప్రాజెక్టు అయిన లెండి నిర్మాణం దశాబ్దాల కాలంగా ముందుకు కదలడం లేదు. ఇటీవలే ప్రాజెక్టును సందర్శించాను. మహారాష్ట్ర, తెలంగాణ నీటి పారుదల శాఖల అధికారులతో మాట్లాడాను. ఈ వారంలో ఇరు రాష్ట్రాల సీఈలతో సమావేశం జరగనుంది. ప్రాజెక్టు పూర్తికి అవసరమైన నిధులు సాధించి, పనులు మొదలయ్యేలా ప్రయత్నిస్తున్నాను. ఏడాదిలోపు పనులు పూర్తి చేసి నీటిని అందించాలన్న లక్ష్యంతో సాగుతున్నా. అలాగే నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులనూ త్వరితగతిన పూర్తి చేయించే ప్రయత్నం చేస్తున్నా.

పోస్టుల భర్తీకి కృషి చేస్తున్నా

జుక్కల్ నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రయత్నాలు చేస్తున్నాను. ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయించా. అప్పట్లో జుక్కల్ నియోజకవర్గానికి కేటాయించిన కేంద్రీయ విద్యాలయం వెనక్కి వెళ్లింది. దాన్ని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాను. స్పోర్ట్స్ స్కూల్ కోసం ప్రయత్నం చేస్తున్నాను. ఉపాధ్యాయ నియామకాలు, పోస్టింగుల్లో కలెక్టర్‌తో మాట్లాడి ఎక్కువ వచ్చేలా ప్రయత్నించి సఫలమయ్యాను. స్కూల్ భవనాలకు నిధులు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాను. మద్నూర్ డిగ్రీ కాలేజీలో పోస్టుల భర్తీ కోసం ప్రయత్నిస్తున్నాను. అన్ని మండలాల్లో జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నాను. అలాగే నియోజకవర్గంలో పిట్లం, జుక్కల్, మద్నూర్, బిచ్కుంద ఆస్పత్రుల్లో వైద్యుల కొరత ఉంది. అధికారులతో మాట్లాడి కొందరిని సర్దుబాటు చేయించాను. అవసరమైన డాక్టర్లను తీసుకువచ్చే ప్రయత్నంలో ఉన్నాను. వైద్య సేవలు మెరుగుపడితే పేదలకు మేలు జరుగుతుంది. కచ్చితంగా ప్రభుత్వ వైద్య సేవలు మెరుగుపడేలా చూస్తా.

త్వరలో బల్దియాగా బిచ్కుంద..

మున్సిపాలిటీ లేని నియోజకవర్గం రాష్ట్రంలో ఒక్క జుక్కల్ మాత్రమే ఉంది. అందుకే నియోజకవర్గానికి మున్సిపాలిటీ మంజూరు కోసం ప్రయత్నించా. త్వరలోనే బిచ్కుంద మున్సిపాలిటీ అవుతుంది. బిచ్కుంద బల్దియాగా మారితే చాలా అభివృద్ధి జరుగుతుంది. నియోజక వర్గంలోని మిగతా మండలాల్లోనూ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాను.

పర్యాటకాభివృద్ధి వైపు అడుగులు..

నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద పర్యాటకాభివృద్ధి కోసం 12 ఎకరాల భూమి ఇప్పటికే ఇరిగేషన్ శాఖ నుంచి పర్యాటక శాఖకు బదిలీ అయ్యింది. ఎకో రిసార్టులు ఏర్పాటు కానున్నాయి. అలాగే కౌలాస్ కోటను కూడా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాను.

నియోజకవర్గానికి వచ్చిన నిధులు..

ఈజీఎస్ కింద సీసీ రోడ్లకు రూ. 34.50 కోట్లు, జీపీ భవనాలకు రూ.18 కోట్లు, అంగన్‌వాడీ భవనాలకు రూ.10.80 కోట్లు మంజూరు చేయించా. ఎస్‌డీఎఫ్ నిధుల్లో విద్యారంగానికి రూ.2 కోట్లు, బోర్లు, మోటార్ల కోసం రూ.1.70 కోట్లు, సీసీ రోడ్లకు రూ.6.30 కోట్లు వచ్చాయి. పిట్లం కేజీబీవీకి రూ.2.35 కోట్లు, మన ఊరు మన బడి కింద మరమ్మతుల కోసం రూ.3.50 కోట్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల కింద రూ.1.82 కోట్లు, ఎస్సీ ఎస్‌డీఎఫ్ నుంచి రూ. 1.54 కోట్లు, ఎస్టీ ఎస్‌డీఎఫ్ నుంచి రూ.10.53 కోట్లు, ఫ్లడ్ డ్యామేజెస్ కింద రూ.55 లక్షలు, కాల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద రూ.6.41 కోట్లు మంజూరయ్యాయి.

పార్టీలో అసంతృప్తి లేదు..

జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తి లేనేలేదు. పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఇద్దరు వ్యక్తులు ఇటీవల రాద్ధాంతం చేశారు. పార్టీతో సంబంధం లేని ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలే ఇదంతా చేయించారని పార్టీ పెద్దలకు తెలిసిపోయింది. ప్రజాస్వామ్యబద్ధంగా మార్కెట్ కమిటీ చైర్మన్‌లను ఎంపిక చేయడాన్ని జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమైంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలుస్తాం.

జుక్కల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తాం

- ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు
- మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపు

మద్నూర్: జుక్కల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో సాగుతున్నామని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి శుక్రవారం మద్నూర్‌లో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చేతులమీదుగా ఈ కార్యక్రమం సాగుతుందని పేర్కొన్నారు. అనంతరం మండలకేంద్రంలోని గురు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే మద్నూర్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. అనంతరం మద్నూర్‌లో నూతన రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ నూతన చైర్‌పర్సన్ సౌజన్య, పార్టీ మండలాధ్యక్షుడు సాయిలు, నాయకులు సాయి పటేల్, హన్మండ్లు స్వామి, రాంపటేల్, రమేష్, శీనుపటేల్, విఠల్‌గురూజీ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

6న జిల్లాకు మంత్రి జూపల్లి రాక



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- పర్యటనకు ఏర్పాట్లు చేయండి
- అధికారులకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశం

కామారెడ్డి క్రైం: ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. మంత్రి పర్యటన ఏర్పాట్లు, ధాన్యం సేకరణ, సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ ఎంట్రీ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మద్నూర్‌లో సమీకృత రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌కు మంత్రి శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం మద్నూర్ ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారంలో పాల్గొంటారన్నారు. లింగంపేటలోని నాగన్నగారి మెట్ల బావి పరిశీలన, కామారెడ్డి బల్దియాలో తాగునీటి వసతుల కల్పన తదితర కార్యక్రమాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొంటారని తెలిపారు. ఆయా కార్యక్రమాలకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని, కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని నిర్వాహకులకు సూచించారు. సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ ఇప్పటివరకు 83 శాతం పూర్తయ్యిందన్నారు. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, సహకార అధికారి రామ్మోహన్, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, ఏఎస్‌వో నరసింహారావు, డీఈవో రాజు, మార్కెటింగ్ అధికారి రమ్య, మున్సిపల్ డీఈఈ వేణుగోపాల్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌డీసీసీబీని మొదటి స్థానంలో నిలపాలి

సుభాష్‌నగర్ : నిజామాబాద్ డీసీసీబీలో లక్ష్యం మేరకు వ్యాపారం చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. బ్యాంకు వ్యాపార కార్యకలపాలు రూ.రెండు వేల కోట్ల టోర్నవర్ మార్కు చేరుకున్న సందర్భంగా మంగళవారం నగరంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఆయన కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ముందుగా లక్ష్యం చేరుకున్నందుకు ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ బ్యాంక్‌లో రూ.794 కోట్లు డిపాజిట్లు, పంట రుణాలు రూ.600 కోట్లు, బంగారు ఆభరణ రుణాలు రూ.317 కోట్లు, ఇతర రుణాలు రూ.313 కోట్లు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన రుణమాఫీలో బ్యాంకులో 40,654 మంది రైతులకు రూ.169.73 కోట్ల లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. అలాగే మాఫీ పొందిన రైతులకు రూ.160.47 కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. మిగిత వారికి కూడా త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు రమేశ్‌పాటిల్, ఆనంద్, ప్రొఫెషనల్ డైరెక్టర్ యాదగిరి, సీఈవో నాగభూషణం, జనరల్ మేనేజర్ అనుపమ, డిప్యూటీ జనరల్ మేనేజర్ సుమమాల తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి

'సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం'



బహుమతులు అందిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి, కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 48,446 మంది దివ్యాంగులకు దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలు అందించామన్నారు. దివ్యాంగులకు పలు రకాల రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. 18,080 మందికి ప్రతినెలా రూ.7.26 కోట్లను పింఛన్‌ల రూపంలో పంపిణీ చేస్తున్నామన్నారు. దివ్యాంగులను సకలాంగులు పెళ్లి చేసుకుంటే రూ.లక్ష ప్రోత్సాహక బహుమతి ఇస్తున్నామని తెలిపారు. సదరం క్యాంప్ స్లాట్‌లను 650 కి పెంచామన్నారు. ఉపాధి హామీ పథకం కింద దివ్యాంగులకు సులువుగా ఉండే పనులు కల్పిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులకు ఉపాధి హామీ పథకం కింద పనులు గుర్తించి నమోదు చేయడంలో రాష్ట్రంలో నాలుగో స్థానంలో ఉన్నామని, 64 వేల పని దినాలు కల్పించి రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచామని పేర్కొన్నారు.

దివ్యాంగులకు అండగా నిలుస్తున్నాం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దివ్యాంగులకు అండగా నిలుస్తోందని ఆ సంస్థ కార్యదర్శి నాగరాణి పేర్కొన్నారు. వైకల్యం ఉందని కుంగిపోవద్దని, పట్టుదలతో శ్రమించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ చేయాలని, అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులు అందించారు. ఉపాధి హామీ పథకం కూలీలు, సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వి.వి క్టర్, ఇన్‌చార్జి డీడబ్ల్యూవో చందర్ నాయక్, డీఆర్‌డీవో సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ..

కామారెడ్డి క్రైం: ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా మంగళవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో రంగోళి పోటీ, మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కమిషనర్ శ్రీహరి, డిప్యూటీ ఈఈ వేణుగోపాల్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాసేవలో నిమగ్నం కావాలి

- టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు



టీజీవోస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సన్మానిస్తున్న జిల్లా అధికారులు

కామారెడ్డి అర్బన్: అధికారులందరూ అహంభావాన్ని వదిలి ప్రజాసేవలో నిమగ్నం కావాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవోస్) రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని డెయిరీ కళాశాల ఆడిటోరియంలో టీజీవోస్ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు ఐక్యమత్యంతో ఉంటే ప్రభుత్వం నుంచి అన్ని డిమాండ్లు సాధించుకోవచ్చన్నారు. ప్రభుత్వ పనికి మాలిన ఉత్తర్వులతో ఉద్యోగులకు రావాల్సినవి దక్కకుండా పోతున్నాయని, నగదు రహిత హెల్త్ స్కీం పథకం నీరుగారిపోయిందని పేర్కొన్నారు. పీఆర్సీ, డీఏ బకాయిలు, మెడికల్ బిల్లుల రీయింబర్స్‌మెంట్ తదితర అంశాలపై ఏప్రిల్ తర్వాత కార్యాచరణ ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ప్రభుత్వానికి సేవకులుగా ఉండి ప్రజలను మెప్పించి అన్ని డిమాండ్లు సాధించాలనేదే తమ లక్ష్యమన్నారు. అన్ని జిల్లాలో టీజీవోస్ భవన నిర్మాణాలు ఏర్పాటు కావాలన్నారు. సమావేశంలో టీజీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా నూతన అధ్యక్షుడు దేవేందర్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఆయా జిల్లాల టీజీవోస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వారిని ఎలా సక్కగ చేయాలో తెలుసు..

కలెక్టర్లు బ్రిటీష్ వైస్రాయ్‌ల్లాగా నియంతలం అనుకుంటే వారిని ఎలా సక్కగ చేయాలో తమకు తెలుసని టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. కొన్ని జిల్లాల్లో కలెక్టర్లు నియంతల్లాగా వ్యవహరిస్తూ అధికారులను అవమానపరుస్తున్నారన్నారు. సామాన్యులు వెళ్లినా గవర్నర్‌లాంటి వారు లేచి నిలబడి మర్యాద ఇస్తారని, కూర్చోబెట్టి మాట్లాడతారని పేర్కొన్నారు. ఉద్యోగులను బానిసలుగా చూసే కలెక్టర్ల విషయమై జిల్లాల నాయకత్వాలు కార్యాచరణ ప్రకటిస్తే తాము ముఖ్యమంత్రిని కలిసి మాట్లాడుతామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ప్రజలకు అవసరమైన మొక్కలే పెంచండి

ఎల్లారెడ్డి: నర్సరీలో ప్రజలకు అవసరమైన, కోరుకుంటున్న మొక్కలను మాత్రమే పెంచేలా చూడాలని ఈజీఎస్ అదనపు డీఆర్‌డీవో వామన రావు సూచించారు. మంగళవారం ఎల్లారెడ్డి మండలంలోని లక్ష్మాపూర్ ఈజీఎస్ నర్సరీని ఆయన పరిశీలించారు. నర్సరీలోని ప్రతి మొక్క బతికేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఈజీఎస్ ఏపీఎం వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాల కోసం కమిషనర్‌ను నిలదీసిన కార్మికులు



కామారెడ్డి టౌన్: పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీహరిరాజును మున్సిపల్ కార్మికులు మంగళవారం నిలదీశారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కార్మికులు కలిసి ఈ విషయం గురించి మొర పెట్టుకున్నారు. వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో అప్పులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని కలెక్టర్ ముందు కార్మికులు వాపోయారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఒక నెల వేతనాన్ని వెంటనే కార్మికుల ఖాతాలో జమచేశారు. మిగితా రెండు నెలల వేతనాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. నాయకులు రాజనర్సు, ప్రభాకర్, ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంతాచారికి ఘన నివాళి



బాన్సువాడ/బాన్సువాడరూరల్ : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కాంక్షిస్తూ తన ప్రాణాలను త్యాగం చేసిన శ్రీకాంత్‌చారి వర్ధంతిని మంగళవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. బాన్సువాడ పట్టణంలో, బోర్లం గ్రామంలో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు, మలిదశ ఉద్యమ కారులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వ కృషి

- సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



మహిళలకు రూ.2 కోట్ల చెక్కును అందజేస్తున్న వ్యవసాయ సలహాదారు పోచారం, కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ : మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడలో మంగళవారం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి మున్సిపల్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలు, మహిళ శక్తి, వీధి వ్యాపారులకు బ్యాంకు రుణాలకు సంబంధించిన రూ. 2 కోట్ల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా వడ్డీ లేని రుణాలు ఇచ్చి కృషి చేస్తోందని అన్నారు. మహిళలు స్వయంగా ఉపాధి పొందేందుకు బాన్సువాడ పట్టణంలో రెండు ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్లను మంజూరు చేస్తుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అంతకుముందు మహిళా శక్తి క్యాంటీన్‌లో పోచారం, కాసుల బాల్‌రాజ్‌లు భోజనం చేశారు. అనంతరం మాతా శిశు సంరక్షణ ఆస్పత్రిలో కొనసాగుతున్న తాత్కాలిక షెడ్డు పనులను పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులున్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం



బాన్సువాడలో ర్యాలీ నిర్వహిస్తున్న బాల్‌రాజ్



ఎల్లారెడ్డిలో.. మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్

బాన్సువాడ: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. మంగళవారం బాన్సువాడలో ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి మహిళలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. వార్డుల్లో నిల్వ ఉన్న చెత్తను తొలగించి మహిళలు అక్కడ ముగ్గులు వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు ఖలేక్, నార్ల సురేష్, అసద్, ఎజాస్, తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డి మున్సిపల్ ఆధ్వర్యంలో..

ఎల్లారెడ్డి: ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ఎల్లారెడ్డి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు.. మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, కౌన్సిలర్లు కార్యాలయ ప్రాంగణం నుంచి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని అన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీ చౌక్ వరకు కొనసాగింది. మున్సిపల్ మేనేజర్ వాసంతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి స్థల పరిశీలన



ఎల్లారెడ్డిలో స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి మంగళవారం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని 200 గజాల స్థలాన్ని ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం కోసం ఎంపిక చేశారు. హౌసింగ్ శాఖ ద్వారా ఈ నిర్మాణాలను చేపడుతున్నారని ఈ మోడల్ హౌస్ మాదిరిగానే లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని ఆర్డీవో సూచించారు. ఎంపీడీవో ప్రకాష్, హౌసింగ్ డీఈ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయం పక్కన ఉన్న స్థలంలో ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను నిర్మించడానికి స్థలాన్ని మంగళవారం అధికారులు పరిశీలించారు. హౌసింగ్ డీఈ సుభాష్, ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, తహసీల్దార్ రహిమొద్దీన్, ఎంఈవో రామస్వామి తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్(ఎస్‌టీయూటీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీపీఎఫ్, జీఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సప్లమెంటరీ, మెడికల్ బిల్లులకు సంబంధించి లక్షలాది రూపాయలు ఈ-కుబేర్‌లో నిలిచి పోయాయని వివరించారు. జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములు, నాయకులు ఖలీమొద్దీన్, రాజేందర్, రమేష్, రాజు తదితరులున్నారు.

ఎస్టీయూలో చేరిక

టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు ఎస్టీయూటీఎస్‌లో చేరారు.

'కుమారుడి మృతిపై విచారణ జరిపించాలి'

బోధన్‌టౌన్(బోధన్): నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాకతీయ ఒలంపియాడ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గూడాల శివ జస్విత్ రెడ్డి(14) మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని, సరైన విచారణ జరిపించి న్యాయం చేయాలని విద్యార్థి తండ్రి, బంధువులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతును కోరారు. పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కాకతీయ యాజమాన్యం మాకు శవాన్ని అప్పగించిందని..ఈ విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యం ఉందని, న్యాయం చేయాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీది మోసాల చరిత్ర



బాన్సువాడలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు,



పాల్వంచలో ..



భిక్కనూరులో..

సాక్షి నెట్‌వర్క్: కాంగ్రెస్ పార్టీది మోసాల చరిత్ర అని బీజేపీ నాయకులు విమర్శించారు. మంగళవారం బాన్సువాడ, మాచారెడ్డి, భిక్కనూరు మండలాల పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం మీద 'ఆరు అబద్ధాలు..66 మోసాలు' పేరిట వారు చార్జిషీట్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నేడు రాష్ట్రంలో ఆరు అబద్ధాలు.. 66 మోసాలతో ప్రజలను వంచించిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై విసుగుచెంది కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే వారు బూటకపు హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి ఏడాది పూర్తవుతున్నా నెరవేర్చకపోవడం శోచనీయమన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



సాంద్రను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థిని

బీబీపేట: జాతీయ స్థాయి హాకీ పోటీలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని సాంద్ర సిబి ఎంపికై నట్లు పాఠశాల హెచ్‌ఎం రవీంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయి హాకీ క్రీడా పోటీలలో అండర్-14 బాలికల విభాగంలో ప్రతిభ కనబరిచి గోల్ కీపర్‌గా జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్లు చెప్పారు. ఈ విద్యార్థిని మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీలలో తెలంగాణ జట్టులో గోల్ కీపర్‌గా ఆడనుంది. ఉపాధ్యాయులు ఈసందర్భంగా అభినందించారు.

వ్యాసరచన పోటీలో లచ్చాపేట విద్యార్థిని ప్రతిభ

మాచారెడ్డి: తరగని శక్తి వనరులు అనే అంశంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలో లచ్చాపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని అలుగునూరి రిషితకు ప్రశంసాపత్రం లభించినట్లు హెచ్‌ఎం రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ భవాని, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

- హామీలు అమలు చేసేవరకు పోరాడుతాం
- బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు అరుణతార

బిచ్కుంద: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరిచిపోయిందని, పథకాల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార విమర్శించారు. మంగళవారం ఆమె బిచ్కుందలో విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేశారన్నారు.

అరకొరగా రుణమాఫీ చేశారని, రైతుబంధు ఇవ్వడం లేదని, పింఛ న్ పెంపు ఊసే ఎత్తడం లేదని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలలో ఏ ఒక్కదాన్నీ సరిగా అమలు చేయ డం లేదన్నారు. గ్రామాలలో అభివృద్ధి పనులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వర కు బీజేపీ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో పా ర్టీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు శి వాజీ పటేల్, నరేష్, రాము, విష్ణు, విఠల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టీజీవో కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కామారెడ్డి అర్బన్: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్(టీజీవోస్) జిల్లా శాఖ(2024-2027) నూతన కార్యవర్గం మంగళవారం స్థానిక డెయిరీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేసింది. టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఆర్.దేవేందర్, అసోసియేట్ అధ్యక్షుడిగా యు.సుభాష్, ఉపాధ్యక్షులుగా నీలం లింగం, కే.రాజలింగం, జి.సంతోషిరెడ్డి, కార్యదర్శిగా బి.సాయిరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా వడ్ల రమేష్, ఎస్.నర్సింలు, బి.జ్యోతి, కోశాధికారిగా సుంకరి భూమయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.నిజాం, ప్రచార కార్యదర్శిగా బి.మౌనిక రెడ్డి, కార్యాలయ కార్యదర్శిగా సీహెచ్ శ్రీనివాస్ స్వామి, సాంస్కృతిక కార్యదర్శిగా పి.ప్రశాంత్‌రెడ్డి, క్రీడల కార్యదర్శిగా ఎ.సుధాకర్, కార్యవర్గసభ్యులుగా జి.ఠాకూర్, జి.శశికిరణ్, ఎన్.సవితారెడ్డిలు ప్రమాణ స్వీకారం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



పిట్లం: మండలంలోని తిమ్మనగర్ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మంగళవాం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలంలోని మార్దండ గ్రామానికి చెందిన వడగామ మల్లయ్య(30) పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మంగళవారం విధులు నిర్వహించుకొని బైక్‌పై తిరిగి ఇంటికి వెళ్తుండగా తిమ్మనగర్ శివారులో గుర్తు తెలియని వాహణం ఢీకొనడంతో మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

క్రైం కార్నర్

బైక్ చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలు

కమ్మర్‌పల్లి: బైక్ చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలుశిక్ష పడినట్లు కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చౌట్‌పల్లికి చెందిన సమర గంగాజమునకు చెందిన బైక్ చోరీకి గురైంది. ఈమేరకు పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన బోదాసు మహేశ్‌ను అరెస్ట్ చేసి ఆర్మూర్ కోర్టుకు తరలించారు. కేసు విచారణ అనంతరం పూర్వపరాలను పరిశీలించిన ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ దీప్తి మంగళవారం తీర్పును వెలువరించారు. నిందితుడికి ఏడాది జైలుశిక్షను విధించారు. కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించిన కానిస్టేబుళ్లు రామారావు, రాజులను ఎస్సై అనిల్ రెడ్డి అభినందించారు.

అర్ధరాత్రి షాపు తెరిచిన వ్యక్తికి రెండు రోజులు..

ఖలీల్‌వాడి: నగరంలోని చంద్రశేఖర్‌కాలనీ చెందిన మోహన్ తన కిరాణ దుకాణాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిమితికి మించి రాత్రి తెరిచి ఉంచటంతో కేసు నమోదు చేసినట్లు మూడో టౌన్ ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం నవంబర్ 30న తన కిరాణషాప్ దుకాణాన్ని తెరిచి ఉంచడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మోహన్‌కి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. మూడో టౌన్ పరిధిలో ఎవరైనా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిమితికి మించి షాపులు తెరిచి ఉంచితే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

రూ.3.85 కోట్ల గంజాయి, అల్ప్రాజోలం కాల్చివేత



కామారెడ్డి క్రైం: జిల్లా వ్యాప్తంగా 36 కేసుల్లో పట్టుబడిన రూ. 3.51 కోట్ల విలువ చేసే గంజాయి, అల్ప్రాజోలాన్ని సంబంధిత అధికారులు కాల్చివేశారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం పడకల్‌లో ఉన్న శ్రీ మెడికేర్ సర్వీస్ కేంద్రంలో మంగళవారం ఆయా మత్తు పదార్థాలను దగ్ధం చేశారు. కాల్చి వేసిన వాటిలో కామారెడ్డి జిల్లాలోని ఐదు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన 36 కేసులకు సంబంధించి 783.36 కిలోల గంజాయి, 16.625 కిలోల అల్ప్రాజోలం, 1.15 కిలోల డైజోఫాం, 852 గ్రాముల క్లోరల్ హైడ్రైట్, 230 గంజాయి మొక్కలు ఉన్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంత్ రావు తెలిపారు. కాల్చి వేసిన మత్తు పదార్థాల విలువ రూ.3,85,71,325 ఉంటుందని అన్నారు.

సబ్‌మెర్సిబుల్ మోటారు చోరీ

సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగులో బోరు బావి నుంచి సబ్‌మెర్సిబుల్ మోటారును తొలగించి దుండుగులు ఎత్తుకెళ్లారని బాధితుడు సాయిరి కృష్ణ మంగళవారం తెలిపారు. వ్యవసాయ పొలం వద్ద సోమవారం సాయంత్రం వరకు అక్కడే ఉన్నానని, మంగళవారం ఉదయం వెళ్లి చూసేసరికి బోరు బావిలో నుంచి మోటారును ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. కేబుల్ తీగలను, ఇతర సామాగ్రిని అక్కడే వదిలేసి 7.5 హెచ్‌పీ మోటారును ఎత్తుకెళ్లారని తెలిపారు. చోరీ అయిన మోటారు విలువ రూ. యాభై వేల విలువ ఉంటుందని అన్నారు. ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

సుభాష్‌నగర్‌లో చైన్ స్నాచింగ్

ఖలీల్‌వాడి: సుభాష్‌నగర్ కాలనీలోని ఓ కిరాణ దుకాణంలో చైన్ స్నాచింగ్ జరిగినట్లు మూడో టౌన్ ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ ప్రాంతంలోని వెంకటరెడ్డి కాంప్లెక్స్‌లో ఉన్న కిరాణ దుకాణానికి ఓ వ్యక్తి వచ్చి సిగరెట్, కూల్ డ్రింక్ తాగి డబ్బులను యజమాని రజినికి ఇచ్చాడు. ఆమె డబ్బులను కౌంటర్‌లో పెడుతుండగా సదరు వ్యక్తి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు చైన్‌ను లాక్కొని బైక్‌పై పరారయ్యాడు. బాధితురాలు రజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

ఖలీల్‌వాడి: భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి మనస్తాపంతో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. నగరంలోని నాగారం ప్రాంతానికి చెందిన షేక్ సలీం(31) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి 18 నెలల క్రితం భీంగల్ పట్టణానికి చెందిన షేక్ ఇస్తానాతో వివాహమైంది. అతను గతేడాది నుంచి మద్యానికి బానిసై ఎలాంటి పనిచేయడం లేదు. దీంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో అతిగా మద్యానికి బానిసయ్యాడు. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో నాగారంలోని ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ పేర్కొన్నారు.

మద్యానికి బానిసై మరొకరు..

గాంధారి: మద్యానికి బానిసైన ఒకరు జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గాంధారి మండలం సర్వాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన ముదెల్లి పోచయ్య(45) జీపీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా అతను మద్యానికి బానిసై డబ్బుల కోసం భార్య వినోదను ఇబ్బంది పెట్టేవాడు. మంగళవారం ఉదయం మద్యానికి డబ్బులు కావాలని భార్యను అడిగాడు. ఆమె డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో కొట్టాడు. ఆమె బయటకు వెళ్లిపోయిన సమయంలో పోచయ్య ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తల్లిదండ్రులు లేరని..

బోధన్‌రూరల్: తనకు తల్లిదండ్రులు లేరనే మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన బోధన్ మండలంలోని సంగం గ్రామంలో చోటు చేసుకుంది. బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మనీష(జానకి)(18)కి చిన్న నాటి నుంచి తల్లిదండ్రులు లేకపోవడంతో బంధువుల వద్ద ఉంటోంది. తనకు అందరిలా తల్లిదండ్రులు లేరనే మనస్తాపంతో ఈ నెల 2న రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి బంధువు సుంకరి రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాపర్ వైర్ చోరీలో నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

ఖలీల్‌వాడి: ఎలక్ట్రిక్ కాపర్ వైర్ చోరీ కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నవంబర్ 19న రాత్రి 11 గంటల సమయంలో నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధి మెదక్ జిల్లాలోని లక్ష్మాపూర్, శమ్నాపూర్ రైల్వేస్టేషన్ మధ్యలో కొత్తగా రైల్వే ఎలక్ట్రిక్ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నిందితులు 320 మీటర్ల ఎలక్ట్రిక్ కాపర్ వైరును కట్ చేసి దొంగిలించారు. ఇండస్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన సూపర్‌వైజర్ ప్రవీణ్ నవంబర్ 22న నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అందిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు మంగళవారం మెదక్ జిల్లాలోని హవేళి ఘన్‌పూర్‌కు చెందిన అనుమానితులు మూడవత్ అమీన్, మూడవత్ సుభాష్‌లను పట్టుకుని విచారించగా కాపర్ వైర్లను చోరీ చేసినట్లు అంగీకరించారు. నిందితులలో పాటు వీరికి సహకరించిన టింకు సత్యంను అదుపులోకి తీసుకున్నారు. కాపర్‌వైర్‌ను కొనుగోలు చేసిన దుకాణానికి వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన కాపర్ విలువ రూ.1.28 లక్షలు ఉంటుందని, నిందితులను కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో రైల్వే సీఐ శ్రీనివాస్, ఎస్సై తావు నాయక్, గురుదాస్, సలావుద్దీన్ పాల్గొన్నారు.

వైన్ షాప్, కిరాణ దుకాణంలో చోరీ



రుద్రూర్: మండల కేంద్రంలో సోమవారం రాత్రి దొంగలు బీభత్సం చేశారు. వైన్ షాప్, కిరాణ దుకాణాలకు రంధ్రాలు చేసి చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని కోటగిరి రోడ్డులో ఉన్న వైన్స్ వెనుక వైపు రేకును కట్ చేసి దుండుగుల లోపలికి చొరబడ్డారు. అందులోని రూ. 48వేల నగదు, రూ. 48వేల విలువ చేస మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. అంగడిబజార్‌లోని కిరాణ దుకాణం గోడకు రంధ్రం చేసి లోపలికి వెళ్లి సుమారు రూ.10వేలు విలువ చేసే సిగరెట్ ప్యాకెట్లు, నిత్యావసర వస్తువులను దొంగిలించారు. కిరాణషాపునకు సమీపంలో ఉన్న హోటల్‌లో చోరీకి విఫలయత్నం చేశారు. స్థానికుల సమాచారం మేరకు మంగళవారం ఉదయం రుద్రూర్ సీఐ కృష్ణ, కోటగిరి ఎస్సై సందీప్ ఘటన స్థలాలను పరిశీలించారు. దొంగల వ్రేలి ముద్రలను గుర్తించేందుకు క్లూస్ టీమ్‌ను రప్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

లింగంపేట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్సై సురేందర్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యువతి తల్లిదండ్రులు ఈ నెల 2న బంధువుల వివాహ నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చే సరికి తన కుమార్తె లేకపోవడంతో తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నవీపేటలో యువకుడు..

నవీపేట: మండలంలోని స్టేషన్ ఏరియాకు చెందిన రాజేశ్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్ మంగవారం తెలిపారు. ఆరు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. రాజేశ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అశోక్ తల్లి కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కుమారుని అదృశ్యంపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొందని తెలిపారు.

మంగళ్‌పాడ్‌లో మరొకరు..

ఎడపల్లి: మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన నరేందర్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై తెలిపారు. గ్రామానికి చెందిన నరేందర్ బోధన్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో దోబీ పని చేస్తున్నాడు. ప్రతి రోజుల ఉదయం వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేవాడు. గత నెల 19న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. నరేందర్ భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన సాయన్న, శ్రీనివాస్‌లకు చెందిన ఇల్లు మంగళవారం దగ్ధమైంది. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాయన్న, శ్రీనివాస్ ఇంట్లో ఉన్న ఫ్రిజ్‌కు షార్ట్‌సర్క్యూట్ సంభవించడంతో ఇంట్లో మంటలు వ్యాపించాయి. వెంటనే కుటుంబీకులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో వారు సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఇల్లు పూర్తిగా దగ్ధమైందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.